## కూర్గ్‌లో ఎంపీ వద్దిరాజు పర్యటన



పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, జూన్ 23: పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం కర్ణాటకలోని కూర్గ్ (కొడుగు)లో మూడో రోజు సమావేశమైంది. స్థాయీ సంఘం అధ్యయన యాత్ర కర్ణాటకలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. సోమవారం ఆ సంఘం చైర్మన్ సునీల్ తట్కరే అధ్యక్షతన సభ్యులు వివిధ చమురు సంస్థల ఉన్నతాధికారులు, అధికారులు, ప్రతినిధులతో సమావేశమై వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన మరింత మెరుగైన, సత్వర సేవలందించే అంశాలపై చర్చించారు. చమురు సంస్థల పురోభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

## అమెరికా యుద్ధోన్మాదం ఖండించండి

### సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమే దాడులు

### సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

వైరాటౌన్, జూన్ 23: సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమే అమెరికా ఇరాన్‌పై దాడులకు పాల్పడుతుందని, అమెరికా దాడులు అంతర్జాతీయ ఉద్రిక్తతలను పెంచుతాయని సీపీఎం కేంద్ర కమిటీ స భ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం వైరా పట్టణం, కొణిజర్ల మండలాల పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఇరాన్ అణు ఆయుధాలను తయారు చేస్తుందని న్న ఎలాంటి ఆధారం లేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ, అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు తెలిపినా ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించడం కోసం దాడులు చేస్తుందని విమర్శించారు. ప్రపంచ దేశాల మధ్య శాంతిని నెలకొల్పాలని, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు యుద్ధాన్ని ఖండించాలని కోరారు.

## గ్లోబలైజేషన్ వద్దు.. లోకలైజేషన్ ముద్దు

వైరాటౌన్, జూన్ 23: గ్లోబలైజేషన్ వద్దు.. లోకలైజేషన్ ముద్దు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం జరిగిన వైరా పట్టణ, కొణిజర్ల మండలం పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. అమెరికా ఆధిపత్యాన్ని, సుంకాలను చైనా చాలెంజ్ చేస్తున్నా, భారత ప్రధాని మోదీ కనీసం నోరు మెదపకుండా లొంగిపోతున్నారని ఎద్దేవా చేశారు. బండి రమేష్, తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చెరుకుమల్లి కుటుంబరావు, కొప్పుల కృష్ణయ్య, పారుపల్లి చంద్రశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

ఖమ్మం,జూన్ 23; ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు అందించే ప్రతి అర్జీని తక్షణమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ అహ్మద్‌షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఏసీపీ వసుంధర పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా అరుణకుమారి

కొణిజర్ల, జూన్ 23: మండలంలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ఖమ్మం బాలుర ప్రిన్సిపాల్‌గా ఎం.జే.అరుణకుమారి పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్కూల్ కోఆర్డినేటర్ శ్రీవిద్య, కళాశాల కోఆర్డినేటర్ కొండలరావు, బోధన, బోధనేతర సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

# మున్నేరు రిటైనింగ్ వాల్‌కు భూసేకరణ చేయాలి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





ఖమ్మం: వినతిపత్రం అందజేస్తున్న సక్కుబాయి, తిరుమలాయపాలెం: ఫిర్యాదు చేస్తున్న బీరోలు మహిళలు

మామిళ్లగూడెం, జూన్ 23 : మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రణాళికాబద్ధంగా చేపట్టి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. 245 ఎకరాల భూమి అవసరం ఉందని, ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న 5 కిలోమీటర్ల వరకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా పట్టా భూమి 138 ఎకరాల వరకు అవసరం ఉందన్నారు. సీతారామ, జాతీయ రహదారులు, సింగరేణి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్‌గౌడ్, ఎన్‌హెచ్ పీడీ రామాంజనేయ రెడ్డి, మేనేజర్ దివ్య, ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విపత్తుల నిర్వహణకు అందుబాటులో బృందాలు**

వానకాలం నేపథ్యంలో జిల్లాలో వరద విపత్తుల నిర్వహణకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. జిల్లాలో గతేడాది వచ్చిన భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని జిల్లాకేంద్రంలో 24మంది సభ్యులతో కూడిన ఎన్‌డీఆర్ ఎఫ్, 24 మంది సభ్యులతో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సమాయత్తం చేశామని తెలిపారు.

**ప్రజల అర్జీలను పరిశీలించి పరిష్కరించాలి**

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో స్వామి తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతులు**

ఖమ్మం, జూన్ 23 : గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను ఆక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రఘునాథపాలెం గ్రామానికి చెందిన పలువురు బీసీ, ఎస్టీ రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన రైతులు బి.సక్కుబాయి, ఏ.గంగయ్య, ఏ.వీరన్న తదితరులు కలెక్టర్‌ను కలిసి తమ బాధను వివరించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, మా భూములు మాకు ఇప్పించాలని కోరారు.

**ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

తిరుమలాయపాలెం, జూన్ 23: మండలంలోని బీరోలులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని నిరుపేద మహిళలు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. అర్హులైన నిరుపేదలకు కాకుండా ధనికులకు, భూములున్నవారికి, ఇళ్లు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. మంజూరైన ఇళ్లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అనర్హులకు ఇళ్లు రద్దుచేసి అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కన్నెకంటి ఎల్లమ్మ, లింగమళ్ల శాంత న్, భవాని, విజిత, నిర్మల, జయమ్మ, రజిత, స్వప్న, ముత్తమ్మ తదితరులు ఉన్నారు.

## 'డ్రోన్' ఉచిత శిక్షణ

రఘునాథపాలెం, జూన్ 23 : సమాజంలో ప్రస్తుతం డ్రోన్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని పదో తరగతి అర్హతతోనే డ్రోన్ ఆపరేటింగ్‌పై ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మహిళా ప్రాంగణాధికారిణి వేల్పుల విజేత తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రోన్ శిక్షణను పొంది వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీలోగా ఖమ్మం నగరం టేకులపల్లి మహిళా ప్రాంగణంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 7660022512 నెంబరును సంప్రదించాలని కోరారు.

## రైతు భరోసా నిధులు జమ

రఘునాథపాలెం, జూన్ 23 : రైతుభరోసా పథకం కింద ఖమ్మం జిల్లాలో 3,53,794 మంది రైతుల ఖాతాల్లో రూ.406.36 కోట్లు జమైనట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 3,53,794 మంది రైతులకు గానూ రూ.436,84,65,365 జమ చేయాల్సి ఉందన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### సీపీ సునీల్‌దత్



అవగాహన కల్పిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం అర్బన్, జూన్ 23 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సీపీ పాల్గొని మొక్కలు నాటారు. సరదా కోసం మొదలైన అలవాటు మత్తులోకి నెడుతుందని, గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత, ఇప్పుడు నిషా కోసం గంజాయి మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా చెడు వ్యసనాలకు మారినట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ 1908లో తెలిపాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, సీఐ బాలకృష్ణ, ఎంఈవో శైలజాలక్ష్మి, హెచ్‌ఎం శాంత, ఉపాధ్యాయులు కట్టా శేఖర్‌రావు, సుజాత, ఉమాదేవి పాల్గొన్నారు.

**'డైట్'లో మాదక ద్రవ్యాలపై అవగాహన**

ఖమ్మం నగరంలోని డైట్ కళాశాలలో మాదక ద్రవ్యాలు తీసుకుంటే కలిగే అనార్థాలపై సీఐ భానుప్రకాష్ అవగాహన కల్పించారు. సోమవారం డైట్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలమురళి, ఎస్ ప్రసాద్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, పద్మ, నగేష్, సైదులు, సుధీర్, సత్యం, రామకృష్ణారెడ్డి, అమీర్ పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి**

వైరాటౌన్, జూన్ 23: విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వైరా ఎస్సై రామారావు అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో గంజాయి మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే పోలీస్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఒలంపిక్ రన్



ఒలంపిక్ రన్‌లో పాల్గొన్న అధికారులు, క్రీడా ప్రముఖులు

ఖమ్మం సిటీ, జూన్ 23 : జిల్లా ఉన్నతాధికారులు.. క్రీడాశాఖ యంత్రాంగం.. ఖమ్మం నగరానికి చెందిన పలువురు ప్రముఖులు.. చిన్నారి క్రీడాకారులు.. యువతీ యువకులు కలిసి నిర్వహించిన ఒలంపిక్ రన్ ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఒలంపిక్ ర్యాలీ నిర్వహించారు. సర్దార్ పటేల్ స్టేడియం నుంచి బయలుదేరి లకారం ట్యాంక్‌బండ్ వరకు కొనసాగిన ర్యాలీని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో అద్భుతమైన క్రీడా వసతులు ఉన్నాయని, క్రీడాకారులు రాణించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి తుంబూరు సునీల్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఉపేందర్, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు పుట్టా శంకరయ్య, క్రిష్టాఫర్, జల్లెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అంకుర హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డాక్టర్ ఉన్నం ప్రసాద్, డాక్టర్ రాకేశ్

ఖమ్మం సిటీ, జూన్ 23: ఆగిపోయే శ్వాసకు రక్తదానంతో ఊపిరిపోద్దామని అంకుర హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ ఉన్నం ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రాకేష్ అన్నారు. హైదరాబాద్ ఆయు ఫౌండేషన్, ఖమ్మం విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో సోమవారం ఖమ్మం అంకుర హాస్పిటల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఒక్క పిలుపుతో యువత భారీ సంఖ్యలో పాల్గొని స్పందించి రక్తదానం చేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. ఆసుపత్రి అధినేతలు మాట్లాడుతూ రక్తదానం పుణ్యకార్యం అని, ప్రతి చుక్కకు ప్రాణం పోసే శక్తి ఉంటుందన్నారు. తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, అందులో భాగంగానే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంకుర హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ సింధు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ కల్పన, డాక్టర్ జాకీర్, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ శ్వేత, మేనేజర్ కందిమళ్ల రామారావు, నాగండ్ల అన్వేష్, యువం ఫౌండేషన్ బాధ్యులు కుక్కల రాజా, మహేష్ పాల్గొన్నారు.

## కేఎంసీలో ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా ఇద్దరు నియామకం

ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 23 : ఖమ్మం నగరపాలక సంస్థలో వార్డు అఫీసర్‌లుగా పనిచేస్తున్న నాగరాజు, రవీందర్‌లను కేఎంసీ ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా నియమిస్తూ సోమవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా పనిచేస్తున్న రాంబాయికి ఇన్‌వార్డు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. మరో ఆర్‌ఐ జ్యోతి ప్రస్తుతం సెలవులో ఉన్నారు.

# భూమి హద్దులు తొలగించారని ధర్నా



ఆళ్లపాడులో రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

బోనకల్లు, జూన్ 23: కాంగ్రెస్ నాయకులు తమ భూమికి సంబంధించిన హద్దులు తొలగించారని ఆరోపిస్తూ ఆళ్లపాడు గ్రామానికి చెందిన మహిళలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు షేక్ మాలాబీ మాట్లాడుతూ మా అన్న కాంగ్రెస్ నాయకుల అండతో తన తండ్రి ఇచ్చిన భూమిలో వాటా రావాలని వాదనకు దిగాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారని తెలిపారు. అయినా హద్దు రాళ్లు తొలగించాడని ఆరోపించారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని భూమి విషయంలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

# మతం, మతోన్మాదం దేశానికే వినాశకరం

పెనుబల్లి, జూన్ 23: దేశంలో ప్రతిమతం, ఇతర మతాల్లోని వ్యక్తుల దాడులకు పురిగొలిపి మతోన్మాదాన్ని సృష్టించేందుకు వెనకాడబోదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని లంకపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న మతాలు, కులాలు ప్రపంచంలో ఏ దేశంలో లేవన్నారు. హిందూమతం పేరుతో రాజకీయంగా ఎదిగిన బీజేపీ నేడు అనేక మైనార్టీ మతాలపై తన పెత్తనాన్ని చలాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ప్రధాన సంపాదకుడిగా నాగిరెడ్డి

ఖమ్మం అర్బన్, జూన్ 23: టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ప్రధాన సంపాదకుడిగా పీ నాగిరెడ్డి ఎన్నికైనట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగిరెడ్డి గతంలో మండల, జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసారన్నారు. మనోహర్ రాజు, రామారావు, విజయ్, పద్మలు అభినందనలు తెలిపారు.

## ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను కేటాయించాలి

బోనకల్లు, జూన్ 23: ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో సభ్యత్వం, జనరల్ ఫండ్ క్యాంపియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులు కేటాయించాలని, బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేసి ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ తరగతులు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యరహిత సమాజంలో భాగస్వాములవ్వాలి



ఖమ్మం అర్బన్: అవగాహన కల్పిస్తున్న సీఐ భానుప్రకాశ్

రఘునాథపాలెం, జూన్ 23: మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్, ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్‌లు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రఘునాథపాలెం పోలీసులు స్థానిక మహాత్మాగాంధీ జ్యోతీబాపూలే బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవరచుకొని ఉజ్వల భవిశ్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా త్రివేణి ఆవిర్భావ దినోత్సవం



కేక్ చేస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

ఖమ్మం అర్బన్, జూన్ 23: ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో సోమవారం త్రివేణి విద్యాసంస్థల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ స్థాపించి 32 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, గొల్లపూడి జగదీష్, కోటేశ్వరరావు, అప్పారావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, స్వప్న, ముస్తఫా పాల్గొన్నారు.

## హరితహారం మొక్కలకు నిప్పంటించిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్

బోనకల్లు, జూన్ 23: హరితహార కార్యక్రమంలో నాటిన మొక్కలు కాస్త ఉపాధిహామీ సిబ్బందే అగ్నికి ఆహుతి చేస్తున్న పరిస్థితి మండలంలోని రావినూతల గ్రామంలో చోటు చేసుకున్నది. గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటారు. బోనకల్లు- వైరా ప్రధాన రోడ్డు మార్గం ఇరువైపులా మొక్కలు నాటారు. రావినూతల గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ వ్యవసాయ భూమి సమీపంలో హరితహారంలో నాటిన మొక్కలకు నిప్పంటించాడు. ఈ విషయంపై ఫీల్డ్‌అసిస్టెంట్‌ను ప్రశ్నించగా ఎటువంటి సమాచారం చెప్పకుండా నా ఇష్టం అంటూ సమాధానం చెబుతున్నాడని ఉపాధి హామీ అధికారులకు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ తగులపెట్టిన మొక్కలను సోమవారం పరిశీలించారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## కేంద్రం చట్టం చేస్తే దేశ వ్యాప్త ఉద్యమం

సత్తుపల్లిటౌన్, జూన్ 23: పెన్షనర్ల హక్కులను భంగం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు హెచ్చరించారు. ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు సోమవారం సంఘ కార్యాలయం నుంచి విశ్రాంత ఉద్యోగులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ప్రధానికి రాసిన లేఖను సూపరింటెండెంట్ శివకుమార్‌కు అందజేశారు. సంఘ కార్యాలయంలో కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వనమారెడ్డి చెంచిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, భద్రుద్దీన్, రాష్ట్ర నాయకులు రామిశెట్టి సుబ్బారావు, ఏఎస్.ప్రకాశరావు, కమలకుమారి, శ్రీదేవి, బూరుగు దాసు, అద్దంకి వెంకటరత్నం, బోడేపూడి బాబు, కృష్ణయ్య, పురుషోత్తం, అప్పారావు పాల్గొన్నారు.

**మధిరలో..**

మధిర, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సంఘం మధిర శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పెన్షనర్స్ రివిజన్ చట్టానికి వ్యతిరేకంగా సోమవారం నిరసన చేపట్టారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ, డీఏలు వర్తించవని లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

## మెప్మా, ఆర్‌పీలతో సమావేశం

వైరాటౌన్, జూన్ 23: వైరా మున్సిపాలిటీలో కమిషనర్ చింతా వేణు మెప్మా ఆర్‌పీలు, సీఎల్‌ఎఫ్ ఈసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ వేణు మాట్లాడుతూ ఎస్‌ఎల్‌ఎఫ్, డ్వాక్రా సం ఘాల పనితీరు, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి వసూలు, ఇందిరా మహిళా శక్తి యూనిట్స్, స్ట్రీట్ వెండర్స్ గ్రూపుల ఏర్పాటు, డ్రైడే కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మెప్మా జిల్లా కోఆర్డినేటర్, మె ప్మా టీఎంసీ, ఆర్‌పీలు, సీఎల్‌ఎప్ ఈసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

మధిర, జూన్ 23: మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక బోడేపూడి భవన్‌లో మండవ ఫణీంద్రకుమారి అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ, శాఖ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిరలో కోట్ల రూపాయలతో వందపడకల ఆసుపత్రిని నిర్మించి దానిని ఇప్పటికీ ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు.

## మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

వేంసూరు, జూన్ 23: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్సై కవిత ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, మొక్కలు జీవకోటి మనుగడకు చెట్లు వృక్షంగా మారి మానవాళిని కాపాడుతాయన్నారు. హెచ్‌ఎం కేవీ.నర్సింహారావు, కానిస్టేబుళ్లు లక్ష్మణ్, రామారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-2** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తి గిఫ్ట్ దస్తావేజు రిజిస్టర్ తనఖా చేయించుకొని **ధరావత్ సతీష్ కుమార్,** S/o: ఈర్య, **వయస్సు :** 24సం||లు, **వృత్తి :** ప్రైవేటు ఉద్యోగి, **నివాసం :** ఇ.నెం.14-4-79, బాలపేట, ఖమ్మం పట్టణం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం జిల్లా అష్యూరెన్సుల రిజిస్ట్రారు మరియు ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్, ఖమ్మం అర్బన్ మండలము, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, బాలపేట నందు గల R.C.C. & A.C. Sheet Roof House, ఖాళీ స్థలము యుక్తముగా గల మునిసిపల్ H.No. 14-4-79నకు (Property Tax Asssessment No: 1106047974) చెందిన ఖాళీ స్థలము మొత్తం విస్తీర్ణము. 119-91 చ||గజములు = 100-26 చ||మీటర్లు నిర్మాణ వైశాల్యము. R.C.C. Roof House : 240-11 Sq.Fts., & A.C. Sheet Roof House (Inc., Toilets) : 276-09 Sq.Fts., మరియు అందుగల సమస్త ఫిక్చర్స్, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, శానిటరీ సహితముగా **డాక్యుమెంట్ నెం.5010/2025,** గల అట్టి స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు:** Gully to Owners & Ramkumar, **పడమర:** Houes of Tejavath Ravinder, **ఉత్తరం :** House of Dharavath Ram Kumar, **దక్షిణం :** Municipal Corporation Road.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది**

★ **నేను తలారి వెంకట్,** S/o. తిరుపయ్య, వృత్తి : కూలి, నివాసం : ఇ.నెం. 3-7-223/1, పంపింగ్‌వెల్ రోడ్, ఖమ్మం. ది. 01-09-2024న వచ్చిన వరదల్లో నా యొక్క ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్ (రి.నెం. 1843225503) పోయినది.

KMM-

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రిక పంపిణీలో
ఏపైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



బాల నాగన్న (ఫైల్)

ఖమ్మం రూరల్, జూన్ 23: మండలంలోని కామంచికల్ గ్రా మంలో ఓ గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతి చెంది న ఘటన సోమవారం మండలం లో చోటుచేసుకున్నది. రూరల్ పో లీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామంచికల్ గ్రామానికి చెందిన బాల నాగన్న(41) రోజు వారి లాగానే సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు పొలం లో ఉన్న తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో నాగన్నను స్థానికులు ఖమ్మం నగరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకవెళ్లగా అప్పటికే నాగన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య బాల నాగమణి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వేంసూరు, జూన్ 23: అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కవిత తెలిపారు. సోమవారం మండలంలోని చోడవరం నుంచి ఆటోలో సత్తుపల్లి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా దుద్దెపూడి గ్రామంలో తరలించేందుకు ఇంటి ముందు రోడ్డుపై ఉంచగా వాటిని కూడా పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

**పేకాట స్థావరంపై పోలీసులు దాడి**

పేకాటస్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేసి 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## ఆటో పల్టీ- ఇరువురికి గాయాలు

ముదిగొండ, జూన్ 23: ఖమం-కోదాడ జాతీయ రహదారిపై ఆటో పల్టీ కొట్టడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండంలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండకు చెందిన దేశబోయిన ఉదయ్, నరేందర్ ఖమ్మం నుంచి ముదిగొండకు ఆటోలో వస్తున్నారు. ముదిగొండ శివారుకు వచ్చేసరికి ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టడంతొ ఇద్దరికి గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108లో ఖమ్మం తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కారేపల్లి, జూన్ 23: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఉసిరికాయలపల్లికి చెందిన సయ్యద్ అమీర్(49), భాగ్యనగర్ తండాకు చెందిన గూగులోతు మాంగ్ ఇద్దరూ మాదారంలో జరిగే సీపీఐ పార్టీ కార్యక్రమ ఏర్పాట్ల కోసం ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్లారు. తిరిగి వస్తుండగా జమాండ్లపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో సయ్యద్ అమీర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మాంగు స్పృహ తప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తీవ్ర గాయాలైన మాంగును ఇల్లెందు ఆసుపత్రికి తరలించారు. సయ్యద్ అమీర్ భార్య రెహనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బైరు గోపి తెలిపారు.

## సివిల్ సప్లయ్ అధికారుల తనిఖీలు

### 22 గ్యాస్ సిలిండర్లు పట్టివేత

రఘునాథపాలెం, జూన్ 23 : ఖమ్మం అర్బన్ పరిధిలోని పలు హోటళ్లపై సోమవారం ఖమ్మం అర్బన్ సివిల్ సప్లై అధికారులు అకస్మిక దాడులు నిర్వహించారు. హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారనే సమాచారంతో ఖమ్మం జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ ఆదేశాల మేరకు పలు హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు హోటళ్లలో 22 అక్రమ సిలిండర్లను గుర్తించారు. వాటిని సీజ్ చేసి 6ఏ కింద కేసులు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మెచ్చు వెంకటేశ్వర్లు తెలిపారు. హోటల్ నిర్వహణలో కేవలం కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని, సబ్సిడీ పొందే డొమెస్టిక్ సిలిండర్లను ఉపయోగించడం నేరమన్నారు. హోటల్ యాజమాన్యాలు సిలిండర్ల నిర్వహణలో నిబంధనలను తుంగలోకి తొక్కితే కఠిన చర్యలకు బాధ్యులౌతారని సివిల్ సప్లై డీటీ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఖమ్మంరూరల్ సివిల్ సప్లై డీటీ విజయ్‌బాబు, నేలకొండపల్లి డీటీ నాగలక్ష్మి, గిర్ధావర్‌లు నరేశ్, పవన్‌కుమార్ ఉన్నారు.